క్లుప్తంగా

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



యాంటీ ర్యాగింగ్ పోస్టర్ మేకింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ వీక్ సందర్భంగా విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. హోమ్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బిందు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు చేయడం నేరమని తెలిపారు. తోటి విద్యార్థినులను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం యాంటీ ర్యాగింగ్‌పై పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. ప్రొఫెసర్లు అరుణ, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

'విభజన భయాందోళన సంస్మరణ దినం' ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

తిరుపతి(అలిపిరి): అలిపిరి సమీపంలోని యూనియన్ బ్యాంకు ఏటీఎం పక్కన మంగళవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో విభజన భయాందోళన సంస్మరణ దినం ఫొటో ఎగ్జిబిషన్‌ను బ్యాంకు తిరుపతి రీజనల్ హెడ్ జి.రాంప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ 15వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం విశ్వనాథరెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిపాయిల తిరుగుబాటుపై పరీక్ష



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ డాక్టర్ శేఖర్

పాకాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 1857లో సిపాయిల తిరుగుబాటు నుంచి 1947 ఆగస్టు 15 వరకు జరిగిన సంఘటనలపై మంగళవారం టెస్ట్ నిర్వహించారు. టెస్ట్‌లో ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు నిస్సీ స్కూల్ కరెస్పాండెంట్ గణపతి తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చంద్రగిరి: నారావారిపల్లి ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న బోధన తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా తిని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పోషకాహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆయన ఆదేశించారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న తిరుపతి అదనపు ఎస్పీ బీహెచ్.విమలకుమారి

తిరుపతి కల్చరల్: మహిళలు చైతన్యవంతులై చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తిరుపతి అదనపు ఎస్పీ బీహెచ్.విమలకుమారి తెలిపారు. ఆధ్వర్యంలో మంగళవారం చెన్నారెడ్డి కాలనీలోని నవభారత్ సేవా సమాజ్ సంస్థ శిక్షణా కేంద్రం మహిళా వికాస్‌లో మహిళలకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారిపై జరుగుతున్న అఘాయిత్యాలు అందుకు కారణమవుతున్న మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి దుష్ప్రభావాల గురించి తెలియజేశారు. మహిళలకు ఇబ్బందులు ఎదురైనప్పుడు 100కు డయల్ చేయడంతోపాటు మహిళా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కొత్తవారితో స్నేహాలు, సోషల్ మీడియా పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం హ్యాండ్ ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సు శిక్షణ కిట్లను అందజేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రహమతుల్లా షరీఫ్, సిబ్బంది లావణ్య, సుమలత, పద్మ, సుజాత, రిజ్వానా, చందన పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

పాకాల: మండలంలోని పాకాల–దామలచెరువు మార్గమధ్యంలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కలకడ మండలం చెరువుముందరపల్లి పంచాయతీ కదిరి చెరువుపల్లికి చెందిన తాపీ మేస్త్రి కట్టా నాగయ్య(65) దామలచెరువు నుంచి పాకాలకు వస్తుండగా ఉప్పరపల్లి పంచాయతీ గుమ్మడివారిఇండ్లు రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని పోలీసులు 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మహేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తిరుపతి నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తిరుపతి - రేణిగుంట రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పల్లం ఉండడంతో చిన్నపాటి వర్షానికే వర్షపు నీటితోపాటు మురుగు నీరు నిలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అల్లూరిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: స్వాతంత్ర పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. అల్లూరి మరణించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఏఐడీఎస్‌వో) నగర కమిటీ 4వ మహాసభలు మంగళవారం బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు ఎ.రాఘవశర్మ, ఎస్వీయూ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ ప్రొఫెసర్ పీసీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ప్రజల విముక్తి కోసం పోరాటం చేసి 27 ఏళ్ల వయస్సులోనే ప్రాణాలు అర్పించిన అల్లూరి మనకు ఆదర్శమన్నారు. ఏఐడీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి ఇ.మహేష్ మాట్లాడుతూ అల్లూరి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించాలన్నారు. అంతకుముందు వందలాది మంది విద్యార్థులు బాలాజీ కాలనీ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ మీదుగా అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐడీఎస్‌వో తిరుపతి నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. నగర కమిటీ అధ్యక్షుడిగా ఎస్.నవీన్‌కుమార్, కార్యదర్శిగా జి.ఉన్నతి, కోశాధికారిగా తేజశ్రీ, సహాయ కార్యదర్శులుగా మధు, ధీరజ్, 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో నగర అధ్యక్షుడు వి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



తిరుపతి నగరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని జేఈవో వీరబ్రహ్మం చెప్పారు. ఆయన మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆస్థానమండపంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీపద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ మాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలియజేశారు. అన్ని విభాగాల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి పాల్గొన్నారు.

ఏసీపీ బాలసుబ్రమణ్యం బదిలీ

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి ఎన్.బాలసుబ్రమణ్యం డిప్యుటేషన్ ఆర్డర్ రద్దు చేయడంతో తిరిగి ఆయన రాజంపేట మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజంపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్గా పనిచేస్తున్న ఆయన డిప్యుటేషన్‌పై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన డిప్యుటేషన్‌ను రద్దుచేసి తిరిగి తన పోస్టుకు వెళ్లాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్విమ్స్‌లో ఘనంగా అవయవ దాన దినోత్సవం

తిరుపతి తుడా: స్విమ్స్‌లో మంగళవారం పద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీలో ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముక్తేశ్వరయ్య, యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అనీల్‌కుమార్, డాక్టర్ అలోక్ సమంత్ దే, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, మెడికల్ అంకాలజీ డాక్టర్ భార్గవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవాలు దానం చేయడం ద్వారా ఎనిమిది మందిని బతికించవచ్చన్నారు. అవయవ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి సంవత్సరం వరకు దాదాపు రూ.20 వేల నుంచి రూ.30 వేలు విలువ వేసే మందులను స్విమ్స్ ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఐదేళ్ల వరకు టీటీడీ ప్రాణదానం పథకం కింద మందులు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవతి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరామిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మావతి చిన్న పిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, స్విమ్స్ ఆర్‌ఎంవో డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్లు ప్రకాష్, సునీల్, హరికృష్ణ, హర్షవర్ధన్ వర్మ, డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి, డిప్యూటీ రిజిస్ట్రార్ యర్రంరెడ్డి, పీఆర్‌వో వి.రాజశేఖర్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్విమ్స్ అధికారులు

ప్రైవేటు పీజీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి సిటీ: విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు పీజీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ డిమాండు చేశారు. ఆయన మంగళవారం విద్యార్థి నాయకులతో కలిసి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పీజీ కళాశాలల ఆగడాలు శృతిమించిపోతున్నాయని ఆరోపించారు. వర్సిటీ నిర్ణయించిన ఫీజులకంటే ఐదింతలు అధికంగా వసూలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. అటెండెన్స్ తక్కువ ఉన్న, ప్రాక్టికల్స్ మార్కులు, పరీక్ష ఫీజుల పేరుతో వేలలో గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగ్జామ్స్ సమయంలో వర్సిటీ అధికారులను మభ్యపెట్టి ఉత్తీర్ణత శాతం పెంచుకుంటున్నారని వెల్లడించారు. ప్రైవేటు కళాశాలల్లో భవనాలు తప్ప విద్యార్థులు ఉండరని, విద్యార్థులు హాజరైనట్లు తప్పుడు సంకేతాలు పంపి వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ వర్సిటీ అధ్యక్షుడు ఉపేంద్ర, పాల్గొన్నారు.



వీసీ, రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న హేమాద్రి

మార్కెట్‌ను శుభ్రంగా ఉంచండి

తిరుపతి తుడా: ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌ను శుభ్రంగా ఉంచడంతోపాటు ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య వ్యాపారులను ఆదేశించారు. ఆమె మంగళవారం ఇంజినీరింగ్, రెవెన్యూ, పారిశుద్ధ్య విభాగం అధికారులతో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. మార్కెట్లో పలుచోట్ల మురుగునీరు, చెత్తాచెదారం ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. మురుగు కాలువలు శుభ్రం చేయాలని చెత్త తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15 ఏర్పాట్లను పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, రాజు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఆర్‌వో కే.ఎల్.వర్మ, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

పొగాకు వినియోగంతో అనర్థాలు

తిరుపతి తుడా: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా మంగళవారం ఎమ్మార్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, డీఎస్పీ నరస్ప, డీఈవో శేఖర్ పాల్గొని పొగాకు వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యాసంస్థలు, ఆలయాల పరిధి లో పొగాకు అమ్మకాలపై నిషేధం విధించామని, మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణం వద్ద నో టొబాకో సేల్స్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నో టొబాకో పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్‌సీడీ పీవో పద్మావతి, ఎస్‌డబ్ల్యూ ఎం.అరుణ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

15న ఉచిత వైద్యశిబిరం

తిరుపతి కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డీబీఆర్ రోడ్డులోని ఎస్వీ అలర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్‌లో ఈ నెల 15న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎస్.సుబ్బారావు తెలిపారు. కంప్యూటరైజ్డ్ పీఎఫ్‌టీ, ఈసీజీ, బ్లడ్ షుగర్ పరీక్షలు చేసి మందులు, ఇన్‌హేలర్స్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7416110259లో సంప్రదించాలని కోరారు.

అర్బన్ తహసీల్దార్‌కు సన్మానం

తిరుపతి రూరల్: తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన భాగ్యలక్ష్మిని ఎంపీపీ వేముల యశోద, ఎంపీడీఓ రమేష్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మంగళవారం ఘనంగా సత్కరించారు. తిరుపతి రూరల్ తహసీల్దార్‌గా అద్భుతంగా పనిచేసి, ఉత్తమ పనితీరుతో మళ్లీ అర్బన్ తహసీల్దార్‌గా రావడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేశారు.



అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీపీ యశోద, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించాలి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని ఆలయాల పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించాలని టీటీడీ మహిళా క్షురకుల వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.రాధాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీటీడీతో పాటు రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులు లక్షల మంది సేవలు అందిస్తున్నారని తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ ప్రకారం ఆలయాల పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు.

108లో సుఖ ప్రసవం



తిరుపతి తుడా: 108 వాహనంలో నిండు గర్భిణీకి సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. బిహార్‌కు చెందిన దీపక్ రేణిగుంట సమీపంలోని బెల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతని భార్య కాజల్‌కు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108కు సమాచారం అందజేశారు. తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకొచ్చే క్రమంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఆటోనగర్ సమీపాన గర్భిణికి పురుడు పోశారు. అనంతరం మెటర్నిటీ ఆస్పత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఊహ, పైలెట్ కె.కేశవు చూపిన చొరవ పట్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా యూవీ కార్డియాక్ కేర్ వార్షికోత్సవం

తిరుపతి తుడా: స్థానిక రెడ్డి రెడ్డి కాలనీలోని యూవీ కార్డియాక్ కేర్ ఆస్పత్రి తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోగులకు ఉచితంగా ఈసీజీ, షుగర్, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ వికాస్ మాట్లాడుతూ మూడేళ్లుగా తిరుపతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మేనేజర్ అంజి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వికాస్

ఓపెన్ స్కూల్ కోర్సులను వినియోగించుకోండి

రామచంద్రాపురం: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం అందిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వివిధ కారణాలతో బడి ఈడు దాటిపోయిన వారు పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవడానికి ఓపెన్ స్కూల్ సువర్ణావకాశం కల్పిస్తుందన్నారు. 14 సంవత్సరాలు నిండిన వారు పదో తరగతికి, 10వ తరగతి పాసైన వారు ఇంటర్మీడియట్‌కు అర్హులని పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రవేశ దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

తిరుపతి రూరల్ తహసీల్దార్‌గా రామాంజనేయులు నాయక్



తిరుపతి రూరల్: తహసీల్దార్‌గా రామాంజనేయులు నాయక్ నియమితులుకానున్నారు. ఆయన ప్రస్తుతం చిత్తూరు రెవెన్యూ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తిరుపతి జిల్లాలో లైన్ క్లియర్ కావడంతో ఆయన్ని కీలకమైన రూరల్ తహసీల్దార్‌గా నియమించే అవకాశం ఉంది. తిరుపతి రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహబూబ్ చాంద్ అనంతపురానికి బదిలీ అయ్యారు. పది రోజుల క్రితమే రామాంజనేయులు నాయక్‌ను రూరల్ తహసీల్దార్‌గా నియమించాల్సి ఉన్నా... చిత్తూరు నుంచి తిరుపతి జిల్లాకు కేటాయించడంలో ఆలస్యమైంది.

ప్రీ-లోక్ అదాలత్ సిట్టింగులు నిర్వహించండి

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులను గుర్తించడానికి న్యాయమూర్తులు ప్రీ-లోక్ అదాలత్ సిట్టింగులను నిర్వహించాలని తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. లోక్ అదాలత్‌లో రాజీ కాదగిన కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి ఆయా స్టేషన్ల పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం లేదా కోర్టు విధులు ముగిసిన తర్వాత సమావేశాలు నిర్వహించి లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. రాజీకి వచ్చే కేసుల వివరాలను ప్రతి సోమవారమూ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి, పదో అదనపు జిల్లా జడ్జి, ప్రిన్సిపల్, అదనపు సీనియర్ సివిల్ జడ్జీలు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరవ జూనియర్ జడ్జీలు ప్రీ-లోక్ అదాలత్ సిట్టింగులను నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెంగమాంబ రచనలతో ఆధ్యాత్మిక చైతన్యం



వెంగమాంబకు నివాళులర్పిస్తున్న ఆముదాల మురళి



తరిగొండ వెంగమాంబ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న శ్వేత ఇన్‌చార్జి సంచాలకులు రాజగోపాల్ తదితరులు

తిరుపతి(అలిపిరి): తరిగొండ వెంగమాంబ తన రచనలతో శ్రీనివాసుడి వైభవాన్ని వ్యాప్తి చేశారని శతావధాని ఆముదాల మురళి తెలిపారు. శ్వేత భవనంలో మంగళవారం తరిగొండ వెంగమాంబ 207వ వర్ధంతి సందర్భంగా వెంగమాంబ సాహిత్యంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీటీడీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ద్వారా వెంగమాంబ రచనలను వెలుగులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. శ్వేత ఇన్‌చార్జి సంచాలకులు రాజగోపాల్, ప్రముఖ పరిశోధకులు కేశవులు, ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ అధ్యాపకులు రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం కేరళ చిత్రకారిణి కృష్ణప్రియ చిత్రించిన తరిగొండ వెంగమాంబ చిత్రపటాన్ని రాజగోపాల్ ఆవిష్కరించారు.

తరిగొండ వెంగమాంబకు పుష్పాంజలి

తిరుపతి కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 207వ వర్ధంతిని పురస్కరించుకుని ఎంఆర్ పల్లి సర్కిల్‌లోని వెంగమాంబ విగ్రహానికి టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రత్యేకాధికారి రాజగోపాల్ మంగళవారం ఘనంగా పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ప్రదర్శించిన భక్తి సంగీత గీతాపాలన భక్తులను ఆకట్టుకుంది. అదేవిధంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఎంఆర్ పల్లి సర్కిల్‌లోని వెంగమాంబ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ప్రతినిధులు సింగం శెట్టిప్ప సుబ్బరామయ్య, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, కేశవులు, ఫణిభూషణరెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలో..

తిరుమల: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 207వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో టీటీడీ అధికారులు మంగళవారం ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. వెంగమాంబ వంశీయులు విశ్వమూర్తి, వెంగమాంబ ప్రాజెక్టు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

తిరుపతి కల్చరల్: ఎస్సీ కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించిన కేసులో సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తెలిపారు. ఆయన మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. వాటిలో పొరపాట్లు జరిగితే సరిచేయాల్సిన దేశ ఉన్నత న్యాయస్థానం అందుకు భిన్నంగా రాజకీయ పాలకుల ప్రమేయంతో తీర్పు ఇవ్వడం విడ్డూరమన్నారు. దేశంలో అగ్రకులాలు కుట్రపూరితంగా రాజ్యాంగ హక్కులను కాలరాసే పరిస్థితి దాపురించిందన్నారు. అంటరానితనానికి గురైన అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేసేందుకు నేడు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణ నాటకానికి తెరలేపినట్టు దుయ్యబట్టారు. దేశంలో 40 కోట్ల మందికిపైగానున్న ఎస్సీ, ఎస్టీ కులాల హక్కులను కాలరాసి, దగా చేసే వర్గీకరణపై భారీ స్థాయిలో పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నేతలు ప్రభాకర్, ధనశేఖర్, రమేష్, గిరి, శంకర్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యమ్మ జాతర

పాకాల: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ సూరినేని వారిపల్లి గ్రామంలో మంగళవారం సత్యమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ఉదయం గ్రామస్తులందరూ అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. అలాగే సాయంత్రం సత్యమ్మ ఆలయం వద్ద పొంగళ్లు నిర్వహించి తల్లికి నైవేద్యం సమర్పించి తమ గ్రామాన్ని చల్లగా చూడాలని ప్రార్థించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డ్రమ్స్ వాయిస్తూ భారీగా బాణా సంచా పేల్చుతూ గెరిగ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కేవైసీకి రైతులు సహకరించాలి

రామచంద్రాపురం: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు సహకార సంఘాల ఎన్నికలలో తమ ఓటుహక్కును కొనసాగించుకోవడానికి తప్పనిసరిగా కేవైసీ చేసుకోవాలని సహకార సంఘం ఇన్‌చార్జి సునీల్ అన్నారు. మంగళవారం స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో సభ్యత్వం, ఓటుహక్కు కల్గిన రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం నకళ్లను అందించి ఈ నెల 30వ తేదీలోగా కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ కన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.